'కూడవెల్లి'కి పోటెత్తిన భక్తులు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అదనపు జడ్జి భవాని

పూజలందుకుంటున్న రామలింగేశ్వరుడు

రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 10 : కూడవెల్లి రామలింగేశ్వరాలయం భక్తజనంతో కిటకిటలాడింది. మాఘామావాస్య సందర్భంగా రెండో శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చా రు. కూడవెల్లి (త్రివేణి సంగమ నది)లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. గత రెండు రోజులుగా కూడవెల్లి దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. సిద్దిపేట జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లా నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం భక్తులకు ధర్మ దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో ఆట వస్తువులు, బ్యాంగిల్ స్టోర్స్, గృహఅలంకరణ వస్తువులు, హోటల్స్, స్వీట్స్, పండ్ల దుకాణాలు రద్దీగా మారాయి. సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే పూజలు..

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం రాత్రి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ అధికారులు, అర్చకులు సన్మానించారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, నాయకులు ఉన్నారు.

ఎల్కల్‌లో ఆధ్యాత్మిక శోభ

రాయపోల్, ఫిబ్రవరి10: మండలంలోని ఎల్కల్‌లో వెలిసిన అనంత పద్మనాభస్వామి దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకుడు అట్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల12న అనంత పద్మనాభస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభానికి అభిషేకం,హోమం,మహాపూర్ణాహుతి, శాంతికల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠకు త్రిదండి చినజీయర్‌స్వామితో పాటు వర్గల్ విద్యాసరస్వతీ ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖరశర్మ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆయుష్ మాజీ కమిషనర్ అట్ల రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు హాజరుకానున్నట్లు తెలిపారు.

ధ్వజస్తంభ ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

మార్మోగిన నారసింహ నామం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 10: పుల్లూరు బండ క్షేత్రం నారసింహ నామస్మరణతో మార్మోగింది. శనివారం రెండోరోజు లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. బండ కింద ప్రాంతం భక్తులరాకతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు.

జాతరలో దుకాణాల సందడి

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 10: మద్దూరు మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మలయాళ సద్గురు గీతా మందిర మఠాధిపతి విష్ణుసేవానందగిరి వైదిక నిర్వహణలో పురోహితులు వివిధ అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం బొడ్రాయి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో గ్రామ నలువీధుల్లో ఊరేగించారు. అనంతరం బొడ్రాయి విగ్రహానికి జలాభిషేకం, పుష్పాభిషేకం, ఫలాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. పురోహితులు విష్ణుమూర్తిశర్మ, తిరుపతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 10 : పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన అంకిరెడ్డిపల్లికి చెందిన అన్వర్, విశ్వనాథ్‌పల్లికి చెందిన గొడుగు దేవవ్వ, రాంపల్లికి చెందిన చిట్యాల రాములు కుటుంబాలకు బీఆర్ఎస్ తరపున ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చెక్కులను శనివారం వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా సౌకర్యం కల్పించారన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో 97 వేల పైచిలుకు సభ్యత్వాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు గజ్వేల్ నియోజవర్గంలో 338 కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేశామన్నారు. భవిష్యత్‌లో కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుగుణాదర్గయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కుమార్‌యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు సాయిబాబాగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సూర్యనమస్కారాల పోటీలు

సిద్దిపేట, ఫిబ్రవరి10 : సిద్దిపేట బాలబాలికల పాఠశాలలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, యోగా శిక్షకుడు తోట సతీశ్ తెలిపారు.300 మంది యోగా సాధకులు పోటీల్లో పాల్గొంటారని, మహిళలు,పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. 51 సూర్య నమస్కారాలు చేసిన వారికి కాంస్య పతకాలు, 75 సూర్య నమస్కారాలు చేసిన వారికి రజత పతకం, 108 సూర్య నమస్కరాలు చేసిన వారికి బంగారు పతకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవానికి పతంజలి యోగా పీఠం జాతీయ ప్రతినిధి స్వామియజ్ఞదేవ్ , రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొంటారన్నారు.

బడ్జెట్‌లో రైతులకు మొండి చెయ్యి

చేర్యాల, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రైతులకు మొండి చెయ్యి చూపిందని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో నామమాత్రంగా నిధులు కేటాయించి రైతు భరోసా, రైతుబీమా, కౌలు రైతులకు చేయూతతో పాటు పంటల బీమా, పంటలకు అదనపు మద్దతు ధర ఎక్కడి నుంచి అందజేస్తారని ప్రశ్నించారు. కేవలం అధికారంలోకి రావడం కోసం తెలంగాణ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హామీల అమలులో మోసం

తొగుట, ఫిబ్రవరి 10: ఎన్నికల్లో కొండంత ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో తీరా మోసం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా, 24 గంటల కరెంట్ ద్వారా రైతును రాజు చేయగా, నేటి ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు రూ.82000 కోట్లు అవసరం ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ. 19746 కోట్లు కేటాయించిందన్నారు.

సమాజ సేవకు కేరాఫ్ గజ్వేల్ లయన్స్ క్లబ్‌లు

గజ్వేల్అర్బన్, ఫిబ్రవరి10: సమాజసేవకు కేరాఫ్ అడ్రస్‌గా గజ్వేల్ లయన్స్‌క్లబ్‌లు నిలుస్తున్నాయని చెప్పుకోవడానికి గర్వంగా ఉందని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞాగార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో రీజియన్‌మీట్ నిర్వహించారు. ఉత్తమ సేవ లందించిన లయన్స్‌తో పాటు సమాజంలో ఉత్తమ సేవలందిస్తున్న వారిని అవార్డులతో సన్మానించారు. మోటివేటర్ నాగేశ్వర్‌రావు, 320డి గవర్నర్ లక్ష్మితోపాటు రిజియన్ చైర్మన్ రాధాకృష్ణ, స్టార్స్ హెల్త్ కేబీపీ శ్రీనివాస్, మోటివేటర్ నాగేశ్వర్‌రావు ప్రసంగించారు. కార్యక్రమంలో లయన్స్ ఉప్పల మెట్టయ్య, సంజయ్‌గుప్తా, పరమేశ్వరాచారి, డాక్టర్ లింగం, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగదు పురస్కారం పొందిన విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

ప్రోత్సాహకాలు ఇవ్వడం అభినందనీయం

హుస్నాబాద్, ఫిబ్రవరి 10 : పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎన్ఆర్ఐ వెల్దండి సత్యనారాయణ తన తండ్రి వెల్దండి చంద్రమౌళి జ్ఞాపకార్థం నగదు పురస్కారాలు అందజేశారు. గత విద్యాసంవత్సరంలో అధిక మార్కులు సాధించిన బాలురు, బాలికల విభాగంలో ప్రథమ రూ.8వేలు, ద్వితీయ రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, హెచ్ఎం వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న కౌన్సిలర్లు హరీశ్, శ్రీనివాస్

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కౌన్సిలర్లు బొజ్జ హరీశ్, దొడ్డి శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని 19వ వార్డులోని అంగన్‌వాడీకేంద్రంలో శనివారం గర్భిణులకు కోడిగుడ్లు, బాలామృతం, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న భోజనం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

సజావుగా 'నవోదయ' ప్రవేశ పరీక్షలు

వర్గల్,ఫిబ్రవరి10: వర్గల్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి తొమ్మిదో తరగతి,11వ తరగతుల్లో పరిమితసంఖ్యలో ఏర్పడే ఖాళీల భర్తీ కోసం శనివారం జరిగిన ప్రవేశ పరీక్షలు సజావుగా ముగిసినట్లు వర్గల్ నవదోయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. 9వ తరగతికి 1109 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 334 మంది గైర్హాజరుకాగా 775 మంది హాజరయ్యారు.11వ తరగతికి 1052 మంది దరఖాస్తు చేసుకోగా 279 మంది గైర్హాజరై 773 మంది హాజరయ్యారు. వర్గల్‌తోపాటు గజ్వేల్‌లో మరోరెండు కేంద్రాల్లో జరిగిన పరీక్షలను ఆర్డీవో బన్సీలాల్ తనిఖీ చేశారు.

నేషనల్ హైవే పనులకు సహకరించాలి

చేర్యాల, ఫిబ్రవరి 10 : జనగామ నుంచి సిద్దిపేట నేషనల్ హైవే 365/బీ రోడ్డు పనులు పట్టణంలో కొనసాగుతున్నాయని, పనులు సక్రమంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ హైవే పట్టణ మధ్య నుంచి పోతున్న సందర్భంగా హైవేస్ నిబంధనల మేరకు రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్లు వెడల్పు ఇరువైపులా నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. 50 ఫీట్ల లోపలికి వచ్చే మెట్లు, రేకులు, అరుగులు, బిల్డింగ్ బాల్కానీలను ప్రజలు స్వచ్ఛందంగా తొలిగించుకోవాలని, లేని పక్షంలో నేషనల్ హైవే, మున్సిపల్ సిబ్బంది వాటిని తొలిగిస్తారని తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల వల్ల పట్టణంలోని పలు ప్రదేశాల్లో భవనాలు, షెటర్లు, మెట్లు తదితర వాటిని కోల్పోతున్న యజమానులు మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

ఆక్రమణలు తొలిగించడంతో రోడ్డు పైకి వచ్చిన యజమానులు

దవాఖానలను శుభ్రంగా ఉంచుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10: దవాఖానలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎంఆర్. రాజశేఖర్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని పలు ప్రైవేట్ దవాఖానలను శనివారం ఆయన పరిశీలించారు. దవాఖానలతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా రోగాలను అరికట్ట వచ్చని ఆయన దవాఖాన నిర్వాహకులకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

చెత్తను తడి, పొడిగా వేరుచేసి ఇవ్వాలి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 10 : తడి, పొడిచెత్తను వేర్వేరుగా మున్సిపల్ వాహన సిబ్బందికి ఇవ్వాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. బాల ఎల్లం, జూనియర్ అసిస్టెంట్ జాలిగంశంకర్ సూచించారు. పట్టణంలోని రెండోవార్డులో శనివారం తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంట్లోని తడి, పొడిచెత్తను కలిపి మున్సిపల్ వాహన సిబ్బందికి ఇవ్వొద్దని సూచించారు. తడిచెత్తతో ఎరువు ఇంట్లోనే తయారుచేసుకునే అవకాశం ఉందని వారు సూచించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని, ఖాళీ స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లో వేయవద్దని చెప్పారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెత్తడబ్బాలను త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నిమ్మల నారాయణరెడ్డి, కొండం కిషన్‌రెడ్డి, జవాన్ ప్రభాకర్‌తోపాటు పలువురు మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం

రేపు సర్వసభ్య సమావేశం

వర్గల్, ఫిబ్రవరి 10 : వర్గల్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మేరీస్వర్ణకుమారి తెలిపారు. గ్రామ స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులందరూ సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు, ఫిబ్రవరి 10 : వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అటవీ కళాశాల డీన్ ప్రియాంక వర్గీస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు 'డీబీటీ-టీఎస్‌సీఓఎస్‌టీ' ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నర్సరీ ఏర్పాటు, వర్మీ కంపోస్ట్ తయారీ, తేనెటీగల పెంపకంలో సర్టిఫికెట్ కోర్సు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు ఈనెల 17లోగా దరఖాస్తును సమర్పించాలని సూచించారు.

జిల్లా ట్రెజరర్‌కు సన్మానం

గజ్వేల్అర్బన్, ఫిబ్రవరి10: సిద్దిపేట జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజును గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు శనివారం సన్మానించారు. గజ్వేల్ సబ్ ట్రెజరీకి వచ్చిన జిల్లా ట్రెజరీ అధికారిని ఇటీవల తెలంగాణ ప్రభుత్వంచే క్రమబద్ధీకరించబడిన లెక్చరర్లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అష్రఫ్, హాషమ్, లవకుమార్, ఉపేందర్, నరేశ్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

చేర్యాల, ఫిబ్రవరి 10 : పట్టణంలో కొనసాగుతున్న జాతీయ రోడ్డు విస్తరణ పనుల వల్ల ప్రజలతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు క్రమపద్ధతిలో జరగడం లేదని, పనులు జరిగే ప్రదేశంలో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని సెవెన్ హిల్స్ హోటల్ ముందు తీసిన కాల్వలో శనివారం రాత్రి కారు ప్రమాదానికి గురైంది. రోడ్డు పనులు జరిగే ప్రదేశంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో కారు డ్రైవర్ నేరుగా వెళ్లడంతో రోడ్డుపై కల్వర్టు నిర్మాణం కోసం తీసిన గుంతలో కారు ముందు భాగం పడిపోయింది.డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై దాడి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

చేర్యాల, ఫిబ్రవరి 10 : రైస్ మిల్లర్స్ చేర్యాల అసోసియేషన్ అధ్యక్షుడు నేతి నారాయణ పై ఇటీవల పలువురు దాడికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో ఉన్న అధ్యక్షుడు నేతి నారాయణ పై కడవేర్గుకు చెందిన సుధాకర్‌తో పాటు పలువురు వ్యక్తులు దాడి చేసి అతన్ని అర్ధనగ్నంగా లాక్కొచ్చి పట్టణంలోని ప్రధాన రహదారి పైకి కొట్టుకుంటూ తీసుకురావడం సంచలనంగా మారింది. ఇంట్లో ఉన్న నేతి నారాయణ పై దాడి జరుగుతున్న సమయంలో నివారించేందుకు యత్నించిన మహిళలపై చేయిచేసుకున్నారు. ఈ విషయమై నేతి నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై దామోదర్ కేసు నమోదు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

వర్గల్, ఫిబ్రవరి 10 : మండలంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్ ఆధ్వర్యంలో 12 వారాలపాటు జరిగే స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ చింతా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అక్కన్నపేట, ఫిబ్రవరి 10: మండలంలోని నందారం క్రాస్ రోడ్డుతో పాటు గుబ్బడి సమీపంలోని భూ నిర్వాసితులు నిర్మించుకున్న కొత్త కాలనీల వద్ద శనివారం ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ మంగ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ రుహీనాత స్కీన్, ఏఈ మౌనిక, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఐలయ్య, రామవరం ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చేర్యాల, ఫిబ్రవరి 10 : కొమురవెల్లి మల్లన్న క్షేత్ర ఆవరణలో ఉన్న లాడ్జీలు, ప్రైవేట్ రూములు కిరాయికిచ్చే యజమానులతో భద్రత, పార్కింగ్ తదితర అంశాల పై చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు, ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జీలు, ప్రైవేట్ గదుల నిర్వాహకులు వారి వారి గదుల్లోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారో రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కిరాయికి వచ్చే వారి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ తీసుకోవాలని, వారి వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో లేదా గదుల ముందు పార్కుచేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మల్లన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. రూముల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు చోలు ఇవ్వకూడదని, ప్రతి రూము ఎదుట సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసింగ్‌లో భాగంగా ఒక సీసీ కెమెరా రోడ్డు కనబడేలా అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

దుబ్బాక, ఫిబ్రవరి 10: విద్యార్థులకు గురుతర బాధ్యతలు తెలిపేందుకు స్వపరిపాలన దినోత్సవం ఉపయోగపడుతుందని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంఈవో ప్రభుదాస్ పేర్కొన్నారు. శనివారం దుబ్బాక పట్టణంలోని గాయత్రీ వివేకానంద విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువన్నపేట పాఠశాలలో..

కొమురవెల్లి, ఫిబ్రవరి 10 : మండలంలోని గురువన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

దుబ్బాక :గాయత్రీ వివేకానంద విద్యాలయంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


కొమురవెల్లి : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రేషన్ షాపుల తనిఖీ

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 10: జిల్లా పౌర సరఫరాల అధికారి తనూజ ఆదేశాల మేరకు మద్దూరుతో పాటు మండలంలోని రేబర్తి, గాగిళ్లాపూర్, వల్లంపట్ల, నర్సాయపల్లి గ్రామాల్లో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ జైనలబ్దీన్ ఆధ్వర్యంలో అధికారులు రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ కరీముద్దీన్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన

బెజ్జంకి, ఫిబ్రవరి 10 : మండలంలోని గుగ్గిళ్ల శివారులో నిర్మించే ఇథనాల్ కంపెనీ నిర్మాణంపై సీఐ శ్రీనివాస్, ఎస్సై నరేందర్‌రెడ్డి గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. కంపెనీకి అన్ని వసతులు ఉన్నందున నిర్మాణం కొనసాగుతుందన్నారు.

గ్రామస్తుల నిరసన..

ఇథనాల్ కంపెనీ నిర్మాణం వద్ద సాయంత్రం గ్రామస్తులు మందు డబ్బాలతో నిరసన తెలిపారు. అనంతరం అక్కడ చేపట్టే నిర్మాణ పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎస్సై అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు.

దేవాదుల కాల్వలో అస్థిపంజరం


నాగపురి దేవాదుల కాల్వలో తేలిన అస్థిపంజరం

చేర్యాల, ఫిబ్రవరి 10 : కొండపోచమ్మ ఆలయ నుంచి నాగపురి వెళ్లే దేవాదుల కేనాల్‌లో అస్థిపంజరం శనివారం వెలుగు చూసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాల వద్ద తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నాగపురివైపునకు నిర్మించిన దేవాదుల కాల్వలోని న